కెమిస్ట్స్, డ్రగిస్ట్స్ అసోసియేషన్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలోని యాగర్లపల్లిలో నూతనంగా నిర్మించిన తాడేపల్లిగూడెం కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ నూతన భవనాన్ని పోర్ట్‌గేట్ అధినేత దేవతి రామకోటేశ్వరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మానేపల్లి పాండురంగారావు మాట్లాడుతూ సంఘ సభ్యులు అందరు ఐక్యంగా ఉంటూ సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సంఘానికి ఎంతోకాలంగా సొంత భవనం నిర్మించాలనే కోరిక సభ్యుల సహకారంతో నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ దేవతి పద్మావతి, అసోసియేషన్ సెక్రటరీ హరిగణేష్, కోశాధికారి జి.గణపతి, నేతలు మేడిన సత్యనారాయణ, వై.ఫణి, ఎం.పవన్ వెంకటేశ్వరావు, నూకల మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

రైతుపై బీమా భారం..!

రబీకి రైతులు ప్రీమియం చెల్లించాల్సిందేనంటున్న ప్రభుత్వం

గత ప్రభుత్వ హయాంలో బీమా ప్రీమియం ఉచితమే

ఎకరాకు రూ.615 వరకూ రైతులపై భారం

రెండు జిల్లాల్లో వరి రైతుల నుంచి దాదాపు రూ. 24 కోట్లు వసూలు

ప్రీమియం కడుతున్నా నిబంధనల పేరిట బీమా సొమ్ము ఎగవేత

ఇ-క్రాప్‌లో ఉంటేనే బీమాకు రైతులు అర్హులు

కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరమే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులపై పంటల బీమా ప్రీమియం భారం మోపేందుకు ప్రభుత్వం పూనుకుంది. రబీలో రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం చెప్పకనే చెప్పేసింది. గత ప్రభుత్వ హయాంలో అమలులో ఉన్న ఉచిత పంటల బీమా ప్రీమియానికి కూటమి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చేసింది. దీంతో రైతులపై బీమా భారం పడనుంది. డిసెంబర్ నెలాఖరులోపు ప్రీమియం చెల్లించాలని గడువు తేదీ ప్రకటించింది. బీమా ప్రీమియం చెల్లింపు భారం వేయడంపై రైతుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రబీలో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి బ్యాంకులు రబీ సాగుకు సంబంధించి పంట రుణాలు ఇవ్వడం ప్రారంభించాయి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం చెప్పింది. దీంతో వరి రైతులు ఎకరాకు రూ.615 బీమా ప్రీమియం చెల్లించాలి. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన నుంచి తప్పుకుని రాష్ట్ర ప్రభుత్వమే బీమా కంపెనీని ఏర్పాటు చేసి ముందుకు సాగింది. రెండేళ్లు దాటిన తర్వాత తిరిగి మళ్లీ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనకు మారినప్పటికీ పంటల బీమా ప్రీమియం మాత్రం రైతులకు ఉచితం చేసింది. ప్రీమియం సొమ్మును ప్రభుత్వమే చెల్లించేది. దీంతో రైతులకు పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉచిత పంటల బీమాను ఎత్తివేసింది. బ్యాంకుల వద్ద రైతులు పంట రుణాలు తీసుకునేటప్పుడు బీమా ప్రీమియం మినహాయించుకుని రుణం ఇస్తున్న పరిస్థితి ఉంది. రెండు జిల్లాల్లో వరిసాగు దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో ఉండగా, బీమా ప్రీమియం కింద రూ.24 కోట్లు వరకూ రైతులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో బీమా ప్రీమియం చెల్లింపు రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ప్రీమియం కడుతున్నా బీమా వస్తుందా..?

ప్రతియేటా బీమా ప్రీమియం కడుతున్నా పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు బీమా సొమ్ము మాత్రం అందని ద్రాక్షగానే ఉంటుంది. నిబంధనల ముసుగులో రైతులకు బీమా సొమ్ము అందడం లేదు. గడిచిన ఐదేళ్లలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులకు బీమా సొమ్ము ఎంత అందించారో కూడా లెక్కలు చెప్పని పరిస్థితి ఉంది. బీమా ప్రీమియం చెల్లింపుపై పెద్దఎత్తున ప్రచారం చేస్తున్న ప్రభుత్వం, బీమా సొమ్ము అందజేత గురించి ఎందుకు మాట్లాడటం లేదో అర్థం కావడం లేదు. బీమా అనేది ఒక బోగస్‌గా తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో రైతులు బీమా ప్రీమియంగా చెల్లించిన సొమ్ము ఎంత.. రైతులకు బీమా సొమ్ముగా అందించింది ఎంతో లెక్కలు తీస్తే బండారం బయటపడుతుంది. రైతులకు బీమా ధీమా లేకుండాపోయిన పరిస్థితి ఏర్పడింది.

కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరం

బీమా ప్రీమియం రైతులే కట్టుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బ్యాంకులు పంట రుణాలు భూయజమానులకే ఇస్తున్నాయి. దీంతో వారి వద్ద నుంచే బీమా ప్రీమియం మినహాయించుకుంటున్న పరిస్థితి కొనసాగుతోంది. దీంతో రైతులకు కౌలుకార్డులు ఇచ్చినా ప్రయోజనం లేకుండాపోతుంది. ఒకే భూమికి రెండుసార్లు బీమా ప్రీమియం చెల్లించే అవకాశం ఉండదు. అంతేకాకుండా ఇ-క్రాప్‌లో ఉన్న రైతులే బీమా ప్రీమియంకు అర్హులుగా నిబంధనలు ఉన్నాయి. ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లు తప్ప కౌలురైతుల పేర్లు పెద్దగా లేకుండాపోయాయి. దీంతో కౌలు రైతులకు బీమా అందని ద్రాక్షగా మారింది.

సూర్య హంసినికి కలెక్టర్ ప్రశంస

ప్రజాశక్తి - భీమవరం

సూర్య హంసినిని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

భారతీయ విద్యాభవన్ విద్యార్థిని మాదాల సూర్యహంసిని మహిళా జాతీయ ర్యాంకింగ్ విలువిద్య అండర్-17 సబ్ జూనియర్స్ కేటగిరీలో వ్యక్తిగత కేటగిరీలో ఒకటి, రెండు రౌండ్లలో బంగారు పతకాలు, టీమ్ తరపున ఒక బంగారు పతకం, ఓవరాల్‌గా భారీ స్కోర్ చేసి ఒక బంగారు పతకాన్ని సాధించింది. దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ఎక్కువ గోల్డ్ మెడల్స్ సాధించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ట్రోఫీని కూడా పొందారు. దీనిలో భాగంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సూర్యహంసిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుజరాత్‌లో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ నేషనల్ స్కూల్స్ గేమ్స్‌లో నాలుగు బంగారు పతకాలను సాధించినట్లు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాదాల సూర్యహంసినిని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సూర్య హంసిని తల్లిదండ్రులు ఎం.రాజగోపాల్‌చౌదరి, ఎం.ప్రవళ్లిక, భారతీయ విద్యా భవన్స్ ఛైర్మన్ యుకె.విశ్వనాథరాజు, సెక్రటరీ కం కరస్పాండెంట్ సామంతపూడి శ్రీరామరాజు, ఎక్స్ అఫీషియో మెంబర్ కె.వెంకట శ్రీమన్నారాయణ, ప్రిన్సిపల్ డిజె.దేవి పద్మ, కోచ్ కమల్ కిషోర్ ఉన్నారు.

70 వేల మంది కొత్త ఓటర్ల నమోదు

పరిశీలన అనంతరం జాబితా తయారీ

టీచర్ ఎంఎల్‌సి ఓటర్లుగా 3,947 మంది, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్లుగా 72 వేల మంది నమోదు

ఓటర్ల నమోదుకు 20వ తేదీ తుది గడువు

రీసర్వే గ్రామసభల ద్వారా 6,478 వినతుల స్వీకరణ

సమర్థవంతంగా దీపం-2 అమలు

రెవెన్యూ ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించబోం

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఓటర్ల నమోదు కార్యక్రమం పెద్దఎత్తున జరుగుతుందని, దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా నూతనంగా సుమారు 70 వేల మంది జనరల్ ఓటర్లుగా నమోదయ్యారని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే టీచర్ ఎంఎల్‌సి ఓటర్లుగా 3,947 మంది, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్లుగా 72 వేల మంది నమోదయ్యారని చెప్పారు. ఈ నెల 20వ తేదీతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. రీసర్వే గ్రామ సభల ద్వారా వచ్చిన ఫిర్యాదులు, దీపం-2 పథకం అమలు, ఇకెవైసి నమోదు, పాస్ పుస్తకాలు జారీ, జాయింట్ ఎల్‌పిఎంలు, రెవెన్యూ సమస్యలు వంటి విషయాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎంతమంది జనాభా ఉన్నారు?

డిఆర్‌ఒ: జిల్లాలో 20 మండలాలు ఉన్నాయి. గణపవరం మండలం ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంది. జిల్లాలో ఏడు నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గం ఉంది. 2024 నాటికి జిల్లా అంచనా జనాభా సుమారు 20,25,599 మంది. వీరిలో పురుషులు 10,12,143 మంది, స్త్రీలు 10,13,456 మంది ఉన్నారు.

ప్రశ్న: జిల్లాలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు?

డిఆర్‌ఒ: జిల్లాలో మొత్తం 14,71,189 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,20,781 మంది, స్త్రీలు 7,50,320 మంది, సర్వీస్ ఓటర్లు 88 మంది ఉన్నారు. జిల్లాలోని 929 ప్రాంతాల్లో మొత్తం 1,461 పోలింగ్ స్టేషన్లు, ఏడుగురు ఇఆర్‌ఒలు, 44 మంది ఎఇఆర్‌ఒలు ఉన్నారు.

ప్రశ్న: కొత్తగా సాధారణ ఓటర్లు ఎంతమంది నమోదయ్యారు?



డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు

డిఆర్‌ఒ: జిల్లావ్యాప్తంగా జనరల్ ఓటర్ల నమోదు ప్రక్రియ సాగుతోంది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. వచ్చే ఏడాది జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. నూతనంగా సుమారు 70 వేల మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు వాటిని పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకూ 11 వేల దరఖాస్తులు తిరస్కరించారు. 48 వేల దరఖాస్తులు ఆమోదించి ఓటు హక్కు కల్పించాం. ఇంకా పరిశీలన జరుగుతోంది. సవరణకు అవకాశం ఉంది. ఫారం-7 ద్వారా మృతి చెందిన ఓటర్ల పేర్లను తొలగించే వెసులుబాటు ఉంది.

ప్రశ్న: ఉపాధ్యాయ ఎంఎల్‌సి, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు ఓటర్లుగా ఎంతమంది నమోదు చేసుకున్నారు?



డిఆర్‌ఒ: జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు 3,947 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. గ్రాడ్యుయేట్‌కు సంబంధించి ఇప్పటి వరకు 72 వేల మంది నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం పరిశీలన జరుగుతోంది. ఈ నెల 20 వరకు ఓట్ల నమోదుకు గడువు ఉంది. గ్రాడ్యుయేషన్ చేసిన వారు ఓటర్లుగా నమోదు కావాలని కోరుతున్నాం.

ప్రశ్న: నీటిసంఘాల ఎన్నికల నిర్వహణకు ఎటువంటి చర్యలు చేపట్టారు?

డిఆర్‌ఒ: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలూ తీసుకున్నాం. ఈ నెల 13న నోటిఫికేషన్ రావాల్సి ఉండగా వాయిదా పడింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉంది.

ప్రశ్న: దీపం-2 పథకం ఎలా అమలవుతోంది?

డిఆర్‌ఒ: దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దీపం-2 పథకాన్ని ప్రారంభించింది. ప్రతి రైస్ కార్డుదారునికి ఏడాదికి మూడు ఉచిత గ్యాసు సిలిండర్ల పంపిణీకి అన్ని చర్యలూ తీసుకున్నాం. అన్ని రకాల గ్యాసు కనెక్షన్లు జనరల్, దీపం, ఉజ్వల, సిఎస్‌ఆర్ కనెక్షన్ల వినియోగదారులు అంతా దీపం-2 పథకానికి అర్హులే. అయితే వారంతా తప్పనిసరిగా ఆధార్, రైస్ కార్డు, బ్యాంకు ఖాతా కల్గి ఉండి ఇకెవైసి చేసుకోవాలి. జిల్లాలో పటిష్టంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలో ఎంతమంది ఈ పథకానికి అర్హులు?

డిఆర్‌ఒ: రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హులే. జిల్లాలో 5,67,651 బియ్యం కార్డుదారులు ఉన్నారు. ఇప్పటి వరకూ 4,52,394 బియ్యం కార్డుదారులను దీపం-2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు అర్హులుగా ఎంపిక చేశాం.

ప్రశ్న: ఇకెవైసి ఎంతవరకు పూర్తి చేశారు?

డిఆర్‌ఒ: ఈ పథకానికి అర్హత సాధించాలంటే ఇకెవైసి తప్పనిసరి. ఇప్పటి వరకు సుమారు మూడు లక్షల మంది లబ్ధిదారులకు ఇకెవైసి పూర్తయ్యింది. ఇంకా సుమారు లక్షా యాభై వేలు మంది ఇకెవైసి చేయించుకోవాల్సి ఉంది. ఇకెవైసి పూర్తి చేసిన వెంటనే వారికి దీపం-2 పథకం వర్తిస్తుంది.

ప్రశ్న: ఇకెవైసి చేయించుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమైనా ఏర్పాటు చేశారా?

డిఆర్‌ఒ: ఒకవేళ లబ్ధిదారుడు ఏదైనా కారణం చేత ఇకెవైసి చేయించుకోకపోతే ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. గ్యాస్ సిలిండర్ డెలివరీ బోయ్ వద్ద ఇకెవైసి చేసుకునే వెసులుబాటు కల్పించాం. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలి.

ప్రశ్న: ఉచిత గ్యాస్ సిలిండర్‌కు ఎప్పటిలోగా సొమ్ము లబ్ధిదారుని ఖాతాకు చెల్లిస్తున్నారు?

డిఆర్‌ఒ: సిలిండర్ పొందిన 48 గంటల్లోగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు వారు చెల్లించిన మొత్తం జమ చేస్తాం. జిల్లాలో సమర్థవంతంగా పథకం అమలవుతోంది. ఇప్పటి వరకు ఎటువంటి ఇబ్బందులూ రాలేదు. ఏవైనా సందేహాలు, ఇబ్బందులు, ఫిర్యాదులు ఉంటే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారాగాని, టోల్‌ఫ్రీ నెంబర్లు 1967, 1800 425 1291కిగాని కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

ప్రశ్న: రీసర్వే గ్రామసభల ద్వారా ఎన్ని వినతులు స్వీకరించారు?

డిఆర్‌ఒ: జిల్లావ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన రీసర్వే గ్రామసభల ద్వారా 6,478 వినతులను స్వీకరించాం. జాయింట్ ఎల్‌పిఎంలకు సంబంధించి 2039 వినతులు, భూమి తగ్గుదలకు సంబంధించి 2729, మ్యుటేషన్‌కు సంబంధించి 764 వినతులను స్వీకరించాం. సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: రెవెన్యూ శాఖలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై మీరు ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

డిఆర్‌ఒ: రెవెన్యూ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వచ్చినా సహించేది లేదు. ఇటీవల కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగంలో ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేసి, మరో ఇద్దరిని వేరే ప్రాంతానికి బదిలీ చేశాం. దీనిని గమనంలో పెట్టుకుని రెవెన్యూ ఉద్యోగులు నడుచుకోవాలి. ఉద్యోగులు నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైతే సస్పెండ్ కూడా చేస్తాం.

కరెంట్ ఆపారు.. ఊపిరి ఆగింది..!

తీవ్ర మనస్తాపంతో ఇంటి నిర్వాసితుడు మృతి

యజమానిని కోల్పోయిన కుటుంబం

ఐ.భీమవరం రోడ్డు ఇళ్ల నిర్వాసితుల ఆవేదన

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని ఐ.భీమవరంలో కాల్వగట్టుపై తొలగించిన ఇళ్లలో నిర్వాసితుడైన టంకాల గోవిందరావు (55) తీవ్ర మనస్తాపానికి గురై అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. తన భర్త మరణానికి అధికారులు, ఉండి ఎంఎల్ఎ బాధ్యత వహించాలని గోవిందరావు భార్య జయమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఐ.భీమవరంలోని కాలువ గట్టుపై సుమారు 40 సంవత్సరాల నుంచి పదుల సంఖ్యలో కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నాయి. రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లను తొలగించడానికి అధికారులు నోటీసులివ్వగా తమకు ప్రత్యామ్నాయం చూపి కొంత సమయం ఇవ్వాలని బాధితులంతా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకూ అధికారులను కలవడంతోపాటు ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజును కూడా కలిసి వినతులు అందించారు. అయితే ఇవేమీ పట్టని అధికారులు జెసిబిలతో ఇళ్లు తొలగించే ఉప్రయత్నం చేయడంతో కొందరు ఖాళీ చేసేశారు. కొందరు ప్రతిఘటించి సిపిఎం ఆధ్వర్యాన పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. దీంతో వెనుదిరిగిన అధికారులు ఎంఎల్ఎ ఒత్తిడినో.. మరే ఇతర కారణాలో తెలియదుగాని సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా, కనీస కనికరం లేకుండా అప్పటికీ ఆయా ఇళ్లలో నివాసం ఉంటున్న ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు తొలగించారు. దీనిపై బాధితులంతా ఆందోళన చేసినా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. ఈ క్రమంలో తన ఇంటి పరిస్థితిని చూసి రోజూ గోవిందరావు భోరున ఏడ్చేవాడు. కూలి పని చేసుకుని కష్టార్జితంతో ఇల్లు కట్టుకున్నానని, ఆ ఇంటిలో నివాసం ఉండే అవకాశం లేకుండా చేశారని కన్నీరుమున్నీరయ్యేవాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇదే క్రమంలో ఇద్దరు అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయగా మరో అమ్మాయి పెళ్లి ఈ పరిస్థితుల్లో ఎలా చేయగలనని గోవిందరావు తల్లడిల్లేవాడని చెబుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గోవిందరావు ఇంటి వద్దే కుప్పకూలిపోయాడని, ఆస్పత్రికి తీసుకెళ్తే బిపి డౌన్ అయ్యిందని, పెరాలసిస్ స్ట్రోక్ వచ్చిందని చెప్పారని భార్య జయమ్మ తెలిపింది. వైద్యుల సూచనతో హుటాహుటీన అంబులెన్స్‌లో విజయవాడ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారని వాపోయింది. ఇల్లు పోయిందనే బాధతోనే గోవిందరావు మృతి చెందాడని బంధువులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. గోవిందరావు భౌతికకాయాన్ని కాల్వగట్టుపై ఉన్న ఇంటి వద్దకే తీసుకొచ్చారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని, దీనిపై ఎంఎల్ఎ, అధికారులు సమాధానం చెప్పాలని ఇళ్ల నిర్వాసితులు కోరుతున్నారు. గోవిందరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఇళ్లు కోల్పోయిన వారందరికీ తక్షణం ప్రత్యామ్నాయం చూపి అన్ని వసతులూ కల్పించాలని వారు కోరుతున్నారు.

మృతుడు గోవిందరావు (ఫైల్‌ఫొటో)

పాలకొల్లులో వైసిపికి షాక్

టిడిపి గూటికి పలువురు సర్పంచులు - ఆహ్వానించిన మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో వైసిపికి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు సర్పంచులు పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. వీరికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇలా చేరిన వారిలో పాలకొల్లు మండలానికి చెందిన దిగమర్రు, కొత్తపేట, గోరింటాడ, ఆగర్రు, వెలివెలి, వాలమర్రు, శివదేవుని చిక్కాల, చందపర్రు గ్రామాలకు చెందిన సర్పంచులు రాపాక నగేష్ కరుణాకర్, కవురు భారతి, మండెల పావని, సాకా గంగారత్నం, కందుల వెంకటేశ్వరరావు, గంటా సత్యనారాయణ, దిడ్ల మణివజ్రం, కొయ్యే అచ్చియ్య టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసి సర్పంచులను భిక్షాటన చేసుకునేలా చేశారని, కూటమి ప్రభుత్వం పంచాయతీల ఆర్థిక పరిపుష్టిని పెంచి తలెత్తుకునేలా గౌరవం పెంచిందన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిన పలువురు సర్పంచులు

ఊరించి.. ఉసూరుమన్పించి..!

రాష్ట్ర బడ్జెట్ జిల్లా వాసులను నిరాశపర్చగా.. నామినేటెడ్ పదవుల పందేరం సాగుతూ ఉండటం అధికారపక్షాలైన టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులకు, జెడ్‌పి అత్యవసర సమావేశం వాయిదా వైసిపి శ్రేణులకు మింగుడు పడని విధంగా తయారైంది.

కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో తన తొలి బడ్జెట్ ప్రవేశ పెట్టింది. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు తమ ఆశలను ప్రతిఫలిస్తాయని ఎదురుచూసిన జిల్లావాసులకు నిరాశే మిగిలింది. చింతలపూడి ఎత్తిపోతలకు రూ.150 కోట్లు కేటాయింపు, పోలవరం ప్రాజెక్టుకు రూ.4,873 కోట్లు కేటాయింపు తప్ప ఇక జిల్లా గురించి ప్రత్యేక ప్రస్తావనే లేదు. వరికి బోనస్ ప్రకటిస్తారని ఎదురుచూసినా రిక్తహస్తమే మిగిలింది. నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్, నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్‌కు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా కేటాయింపులు, పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం నిమిత్తం ప్రత్యేక కేటాయింపుల ఊసేలేదు. ఫలితంగా రెండు జిల్లాల్లోని ప్రధాన సమస్యలు కనీస కేటాయింపులకు, ప్రస్తావనకు నోచుకోకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. నిర్వాసితుల సమస్యలు కచ్చితంగా పరిష్కరిస్తామని కొయ్యలగూడెంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఆ హామీల ప్రభావం, వైసిపి ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వెరసి పోలవరం నియోజకవర్గ ప్రజలు జనసేన తరపున బరిలో నిలిచిన చిర్రి బాలరాజుకు పట్టంగట్టారు. ఈ నేపథ్యంలో కచ్చితంగా నిర్వాసితులకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశించిన వారందరికీ మొండి చేయి చూపారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇక డెల్టా ఆధునికీకరణపైనా పెద్దగా ఆశలు పెట్టుకోకూడదనే సంకేతాలు బడ్జెట్‌లో కేటాయింపులు ఇచ్చాయి. ఎందుకంటే పనులన్నీ వచ్చే మే నెలలో చేపట్టినా పనులకు టెండర్ల ప్రక్రియ అంతా జనవరి లేదా ఫిబ్రవరి నెలల్లోనే పూర్తి చేయాల్సి ఉంది. ఆ రీత్యా ఇప్పుడు కేటాయింపులను బట్టే పనులు జరిగే అవకాశం ఉంది. అలా చూస్తే మాత్రం రూ.25 కోట్లతో డెల్టా ఆధునికీకరణ పనులు మళ్లీ ప్రారంభించడం అసాధ్యం. ఎందుకంటే గత ఐదేళ్లుగా అసలు ఆధునికీకరణ పనుల జోలికెళ్లకపోవడం, అంతకుముందు కూడా అరకొర కేటాయింపుల వల్ల పనులన్నీ ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. ఇప్పుడు అంచనా వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ రీత్యా వచ్చే వేసవిలో డెల్టా ఆధునికీకరణ ఏ మేరకు జరుగుతాయో వేచిచూడాలి.

నామినేటెడ్ పదవులకు సంబంధించి కూటమి ప్రభుత్వం వరుస జాబితాలు విడుదల చేసింది. అయితే ఆశావహులు ఎక్కువ ఉండడం, పదవుల కేటాయింపు తక్కువగా ఉండడం కూటమిలోని ఆశావహుల్లో అసంతృప్తి రేపుతోంది. పార్టీ కోసం పని చేస్తూ గత ఎన్నికల్లో పొత్తు, ఇతర కారణాల వల్ల సీట్లు వదులుకున్న టిడిపి నేతలు గన్ని వీరాంజనేయులు, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, వలవల బాబ్జీ, తోట సీతారామలక్ష్మి, పొత్తూరి రామరాజు, బండారు మాధవనాయుడు వంటి వారితోపాటు జనసేనలో కొటికలపూడి గోవిందరావు, ఘంటా వెంకటలక్ష్మి, మేకా ఈశ్వరయ్య వంటి నేతలకు ఇంకా ఎటువంటి పదవులూ దక్కలేదు. వీరు కాక నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న ద్వితీయ శ్రేణి నాయకుల సంఖ్య పెద్దగానే ఉంది. ఈ నేపథ్యంలో కూటమిలోని టిడిపి, జనసేన అధినేతలు తమ నేతలను ఎలా సంతృప్తిపరుస్తారో వేచిచూడాలి. ఇదే క్రమంలో ఈ రెండు పార్టీల నడుమ నెలకొన్న ఆధిపత్య పోరు కూడా పలు సమస్యలకు దారితీస్తోంది. ఇప్పటికే ఇన్‌ఛార్జి మంత్రుల దృష్టికి ఈ సమస్యలను ఎవరికి వారు ఏకరువు పెట్టుకున్నారు. వీటిని ఏవిధంగా రూపుమాపుతారో, కూటమిని ఐక్యంగా ఎలా ముందుకు తీసుకెళ్తారో వేచిచూడాలి.



జెడ్‌పి ఛైర్‌పర్సన్ వ్యవహారం వైసిపిలో కాక పుట్టించిందనే చెప్పాలి. ఆమె టిడిపిలో చేరడం, వైసిపి జెడ్‌పిటిసిలు ఎవరూ పెద్దగా మారకపోవడం వైసిపికి కలిసొచ్చిన అంశంగా మారింది. సంఖ్యా బలాన్ని దృష్టిలో పెట్టుకుని జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీని పదవి నుంచి తప్పించేందుకు వైసిపి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ప్రత్యేక సమావేశం నిర్వహించినాలని పదేపదే కోరగా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి చివరి నిమిషంలో ఎంఎల్‌సి కోడ్ పేరిట వాయిదా వేయడం వైసిపి జెడ్‌పిటిసిలను నివ్వెరపర్చింది. దీంతో అంతా కలెక్టరేట్‌కు క్యూకట్టారు. కోడ్ కాగానే సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. అయితే టిడిపి వ్యూహాత్మకంగానే సమావేశాన్ని వాయిదా వేయించినట్లు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ ముగిసి మళ్లీ సమావేశం ఏర్పాటుకు కనీసం నెల రోజులకుపైగా సమయం ఉంది. ఈలోపు మెజార్టీ జెడ్‌పిటిసిలను తమవైపునకు తిప్పుకునేందుకు సామ, దాన, దండోపాయాలను ప్రయోగించేందుకు టిడిపి సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే అప్పటికి ఎటువంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచిచూడాలి. మొత్తంగా ఈ వ్యవహారాలన్నీ జిల్లా వాసులతోపాటు అటు టిడిపి, జనసేన, బిజెపి నేతలతోపాటు ప్రతిపక్ష వైసిపి నేతలనూ ఊరించి ఉసూరుమన్పించాయనే చెప్పొచ్చు.

ప్రజా ఉద్యమాల పెన్నిధి సిపిఎం వారం రోజులపాటు జిల్లాలో ప్రజాపోరు యాత్రలు నిర్వహించింది. ఈ ఐదు నెలల కాలంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మోపిన భారాలు, ప్రధానంగా విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు, ఇసుక సమస్య వంటి వాటితో సూపర్ సిక్స్ అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర చట్టం తీసుకురావాలనే డిమాండ్లతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సాగించిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ ప్రచారం మధ్యతరగతి ప్రజలను ఆలోచింపజేసిందనే చెప్పొచ్చు. మొత్తంగా పరిశీలిస్తే తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టరేట్ల వద్ద ధర్నాలకు జన స్పందనే దీనికి నిదర్శనం.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

మండల మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - పాలకోడేరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో అన్ని రంగాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. శృంగవృక్షం ఎఫ్‌సిఐ రోడ్డులోని వలవల శ్రీరామమూర్తి ప్రాంగణంలో సిపిఎం పాలకోడేరు మండల మహాసభ ఆదివారం నిర్వహించారు. తొలుత సీనియర్ నేత తాడి రామారావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు నేతలు దున్న మరియమ్మ, కొటికలపూడి శ్రీను అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముఖ్యఅతిథి గోపాలన్ మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒంటెత్తు పోకడతో పాలిస్తోందన్నారు. జమిలి ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తుందేగాని రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రజలపై అనేక భారాలు మోపడం దారుణమన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టారు. అనంతరం మహాసభ పలు తీర్మానాలు చేసింది. మండలంలోని 14 గ్రామాలకు తాగునీటిని పూర్తిస్థాయిలో అందించాలని, వేంద్ర-శృంగవృక్షం రహదారి, విస్సాకోడేరు-పాలకోడేరు రహదారులు నిర్మించాలని తదితర తీర్మానాలను ఆమోదించారు. సభలో కందివలస దుర్గ, కడలి అప్పారావు, జంగం మనోహర్, పళ్లెం భీమన్న, కలిదిండి గోపాల్‌రాజు, గెద్దాడ వెంకటేశ్వరరావు, శివప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యదర్శిగా ఎన్నికై మాట్లాడుతున్న అశ్రియ్య

మండల కార్యదర్శిగా అశ్రియ్య ఎన్నిక

సిపిఎం మండల కార్యదర్శిగా శేషపు అశ్రియ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులుగా పాలా వెంకటస్వామి, దున్న మరియమ్మ, రెడ్డి అప్పారావు, చెన్నవరపు సుబ్బారావు, కొటికలపూడి శ్రీను, శేషపు ధనరాజు, వీరవల్లి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.

నూతన ఆస్పత్రులు అభినందనీయం : మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో అన్ని ఆధునిక పరికరాలతో కొత్త ఆసుపత్రులు రావడం అభినందనీయమని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ఆదివారం బ్రాడీపేటలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ పిల్లల ఆసుపత్రిని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో కలుషిత వాతావరణం, ఆహారం కారణంగా రోగస్తులు ఎక్కువవుతున్నారని తెలిపారు. చిన్నతనంలోనే అన్ని రకాల వ్యాక్సిన్లు వేస్తూ పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరారు. చిన్నారులకు ఆధునిక సౌకర్యాలతో ఆసుపత్రి నిర్మించిన డాక్టర్ రేగుంట్ల సంతోష్‌ను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో పలు విభాగాలను మాజీ ఎంఎల్‌ఎ బాబ్జి, ముచ్చర్ల సంజయ్, జక్కంపూడి మదన్ ప్రారంభించారు.

రాయలంలో రెడ్‌క్రాస్ కాంపోనెంట్ రక్త కేంద్రం

నేడు ప్రారంభం - కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రాయలంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో నూతనంగా నిర్మించిన బ్లడ్ సెంటర్‌ను ఈ నెల 18న ప్రారంభించనున్నట్లు తెలిపారు. అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్ ద్వారా జిల్లాలోని ఆసుపత్రులకు స్థిరమైన, సురక్షితమైన రక్తాన్ని అందించే లక్ష్యంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రక్తదాన పద్ధతుల్లో నాణ్యత, భద్రత అత్యున్నత ప్రమాణాలతో రక్త సేకరణ, పరీక్ష, నిల్వ సౌకర్యాలను అత్యంత పకడ్బందీగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవల విస్తృత నెట్వర్క్ ద్వారా, సంస్థ అవసరమైన కమ్యూనిటీలకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నదన్నారు. ఈ రక్త కేంద్రంలో ఆధునిక మౌలిక సదుపాయాలు, రక్త సేకరణ, పరీక్ష, ప్రాసెసింగ్, నిల్వ కోసం అధునాతన సాంకేతిక, సౌకర్యాలను కలిగి ఉంటుందన్నారు. రక్తదాతలు, గ్రహీతలకు అత్యంత భద్రతను నిర్ధారించడానికి జాతీయ, అంతర్జాతీయ ఆరోగ్య ప్రమాణాలకు అనుగుణంగా కఠినమైన భద్రత, నాణ్యత ప్రోటోకాల్‌ను అనుసరించడం జరుగుతుందన్నారు.

అనుమతులు లేని బ్యానర్లు తొలగిస్తాం : కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

స్వచ్ఛ నరసాపురం మున్సిపాల్టీలో భాగంగా అనుమతులు లేని బ్యానర్లు, ప్రకటనలు తొలగిస్తామని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనుమతి లేకుండా బ్యానర్లు, ప్రకటనలు అంటిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి పొందిన వారు నిర్దిష్ట సమయం దాటిన తర్వాత వాటిని తొలగించాలని, దీన్ని సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

చిన్నారులకు పండ్లు పంపిణీ

భీమవరం టౌన్: బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎంవి రమణ పుట్టినరోజు సందర్భంగా చినఅమిరం రోడ్డులోని ఇమ్మానుయేలు చిల్డ్రన్ హోమ్‌లోని రమణ మిత్ర బృందం ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు ఆదివారం పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను అనాధ పిల్లల మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు ఉండపల్లి రమేష్ నాయుడు, మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము మాట్లాడుతూ ఇటువంటి పుట్టినరోజు వేడుకలు రమణ మరెన్నో జరుపుకుని మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని అన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించే ఐంటిపేట వృద్ధ సేవాసదనం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఆర్థో డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించి ఆదరణ లేని వృద్ధులకు ఉచిత వైద్యసేవలందించారు. కార్ల సీతాలక్ష్మి ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి అల్లు భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది సహకరించారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బెల్ట్ షాపులపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో తణుకు మండలం కొనాల గ్రామానికి చెందిన గద్దెం వెంకటేష్ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 7 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తణుకు ప్రొహిబిషన్, సిఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు.

సర్పంచులకే ప్రాధాన్యతివ్వండి

పెనుమంట్ర: గ్రామ పరిపాలన విషయంలో నేరుగా ప్రజల నుంచి ఎన్నుకోబడ్డ సర్పంచులకే ప్రాధాన్యతివ్వాలని మండలంలోని జనసేన పార్టీకి చెందిన సర్పంచుల గ్రామ అధ్యక్షుడు బయ్యే బాలాజీ కోరారు. ఆదివారం ఆయన ఓ ప్రకటనలో గ్రామ సౌభాగ్యం కోసం ఆయా గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు, సర్పంచ్ కలిసి పంచాయతీకి వచ్చే నిధులు ఎలా ఖర్చు చేయాలో నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ఏడేళ్లుగా ప్రతి గ్రామంలో సర్పంచ్, మెంబర్లు,గ్రామ కూటమి నాయకులు, కూర్చుని పంచాయతీ నిధులు ఎలా ఖర్చు పెట్టాలో నిర్ణయం తీసుకోవాలని, ఇందులో ఎమ్మెల్యేల ప్రభావం ఉండకూడదని పేర్కొన్నారు.

ఘనంగా ఎంఎల్‌ఎ నాయకర్ పుట్టినరోజు

నరసాపురం: నరసాపురం ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ నాయకర్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు నాయకర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలోని జనసేన కార్యాలయానికి నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తరలివచ్చి పూల బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకర్‌కు కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, మాజీ ఎంఎల్‌ఏలు బండారు మాధవనాయుడు, కొత్తపల్లి జాన కేరామ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.రామరాజు,బి.శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

మొగల్తూరు : ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ జన్మదిన వేడుకలను జనసేన నాయకులు అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కర్రి వీరస్వామి, మేకల పరుశురాం, బోణం నరసింహారావు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ఆచంట: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఉండుర్తి పాల్ ఫౌండేషన్ ముందుంటుందని ఫౌండేషన్ ఛైర్మన్ ప్రసన్న కుమార్ అన్నారు. ఉండుర్తి పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉండుర్తి ఫ్యామిలీ ఆర్థిక సహకారంతో ఆచంట మండలంలోని పెదమల్లం పంచాయతీ పరిధి సిర్రావారిపేటలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన లంక ధనరాజు కుటుంబానికి రూ.2,500 నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ ప్రసన్నకుమార్ ఉండుర్తి, ఉండుర్తి భాను, జోష్ ఉండుర్తి పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

భీమవరం టౌన్: శాంతిభద్రతల పరిరక్షణ, నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గల వారికి పోలీసు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీనిలో భాగంగా భీమవరం పట్టణంలోని వన్ టౌన్ సిఐ నాగరాజు, టూ టౌన్ సిఐ కాళీ చరణ్ రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రస్తుతం జీవిస్తున్న విధానం, జీవనోపాధి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. నిరంతరం మీ కదలికలపై నిఘా ఉంటుందని జరుగుతుందని పోలీసుల మాటలను వినకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హిస్టరీ షీట్లు కలిగిన వారిని సంబంధిత పోలీసు అధికారులు హెచ్చరించారు.

ఆనందకరం పేరుపాలెం బీచ్

మొగల్తూరు: పేరుపాలెం సౌత్, కెపి.పాలెం సౌత్ గ్రామాల్లోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. కార్తీక మాసం మూడో ఆదివారం కావడంతో ప్రకృతి ప్రేమికులు దూర ప్రాంతాల నుండి ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు. బీచ్‌లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పంచాయతీ రెవెన్యూ పోలీస్, మత్స్యశాఖ, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖలకు చెందిన సిబ్బంది విధులు నిర్వహించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రిజర్వేషన్ కేటగిరిలు మార్చండి

ప్రజాశక్తి - వీరవాసరం

రెండు తెలుగు రాష్ట్రాల్లో గవర సామాజిక తరగతికి వర్తిస్తున్న రిజర్వేషన్ కేటగిరిలను మార్చాలంటూ ఆ సామాజి తరగతి రెండు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. శ్రీ గౌరి (గవర) సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం తులసీ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గవర జాతి గర్వించేలా సాటివారికి సాయపడే విధంగా గవర జాతి అభివృద్ధి చెందాలన్నారు. తెలంగాణలో బిసిలుగా ఉన్న గవర సామాజిక తరగతి ఒసిలుగా అక్కడి ప్రభుత్వం మార్చిందని, అదే విధంగా ఆంధ్రాలో బిసి-డిలో ఉన్న గవరలను బిసి - ఎలోకి మార్చాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని తులసీ కన్వెన్షన్ అధినేత మళ్ల రాంబాబు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. తక్షణం తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డితో ఆంధ్రా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాన్‌తో మాట్లాడతానన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్న నిజాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. ముందుగా తోలేరు కనకదుర్గమ్మ ఆలయం నుండి మేళ తాళాలతో పెద్ద ఎత్తున మహిళలు చీర, సారే పట్టుకుని ఊరేగింపుగా వచ్చి తులసీ కన్వెన్షన్ వద్ద ఏర్పాటు చేసిన గౌరీదేవి అమ్మవారికి సమర్పించారు. మండలంలో సేవలందిస్తున్న రాంబాబును ఎంఎల్‌ఎ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి బుద్దా వెంకన్న, మళ్ల సురేంద్ర, మళ్ల శ్రీరామ్మూర్తి, బుద్దా శివాజీ, చదరం తులసీరావు పాల్గొన్నారు.



రాంబాబును సత్కరిస్తున్న ఎంఎల్‌ఎ కొణతాల

గ్రంథ పఠనంతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గ్రంథ పఠనం అందరి బాధ్యత అని, విద్యార్థికి గ్రంథ పఠనం ద్వారా ఉజ్వల భవిష్యత్తు అని ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం వార్డెన్ భానుమణి, ఎం.శ్యామల అన్నారు. ఆదివారం చదువరుల సంఘం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒక మంచి పుస్తకాన్ని చదివితే అవే నీ జీవితాన్ని మారుస్తాయన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ పుస్తక పఠనం జీవిత గమ్యానికి పునాధని తెలిపారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయ ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

గణపవరం: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం పిప్పర గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రచయితలు, కవులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రచయిత్రి శారదా దేవి మాట్లాడారు. సమ్మేళనంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు పమ్మి సత్యనారాయణ, గుడ్ల వెంకట కృష్ణారావు, గ్రంథపాలకులు పి.రంగారావు, ఐవి నరశింహరాజు, విద్యార్థులు, పెద్దలు పాల్గొన్నారు.

ఉండి : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని గ్రంథాలయ అధికారి జక్కంపూడి వెంకట కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం ఉండి శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్, స్లో సైక్లింగ్, పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలను నిర్ణయించారు. 20వ తేదీ ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థీ గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివేందుకు కొంత సమయం కేటాయించాలన్నారు.

తాడేపల్లిగూడెం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో దేశభక్తి గేయాలు నిర్వహించినట్లు గ్రంథాలయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ దేశభక్తి గేయాలు 2 భాగాలుగా 6, 7 తరగతుల విద్యార్థులను జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతుల విద్యార్థులను సీనియర్స్‌గా విభజించినట్లు గ్రంథాలయాధికారి తెలిపారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు ఈనెల 20న డిఎస్‌పి విశ్వనాధ్ చేతుల మీదుగా బహుమతులు అందజేనున్నట్లు తెలిపారు.

ట్రూఅప్ ఛార్జీల భారం అన్యాయం

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - యలమంచిలి

ట్రూఅప్ ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారం వేయడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. ఆదివారం మండలంలోని చించినాడలోని అమరవీరుల స్మారక భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం బి.జార్జి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి బలరాం మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు కరెంటు ఛార్జీలు పెంచబోమని స్పష్టమైన హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.17 వేల కోట్ల భారాన్ని ప్రజలపై ట్రూఅప్ ఛార్జీల పేరిట మోపడం సమంజసం కాదన్నారు. అప్పట్లో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి ఇప్పుడేమో ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని, దీని కారణంగా సెల్‌ఫోన్ మాదిరిగా ముందుగానే రీఛార్జి చేసుకోకపోతే కరెంట్ ఉండదని అన్నారు. దీంతో పేదల ఇళ్లలో కరెంటు లేక చీకట్లు అలుముకునే ప్రమాదం ఉందన్నారు. ఉచిత ఇసుక సక్రమంగా అమలు జరగకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు, నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నూతన మద్యం విధానంతో మందుబాబులు చెలరేగిపోతున్నారని, వారి ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్లు, బడులు, గుడుల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలు వెంటనే తొలగించాలని, బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, మండల కార్యదర్శి కానేటి బాలరాజు, నాయకులు దేవ సుధాకర్, బాతిరెడ్డి సుగుణ, అంబటి రంగనాయకులు, శ్రీరాములు, ఎడ్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

క్రీడల్లో పాల్గొన్న వారు వృద్ధాప్యంలో సైతం ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో చెరుకూరి బుద్ధావతారం రాజు స్మారక ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీల బహుమతుల ప్రదానోత్సవంలో ఆదివారం మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు మంత్రి బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలకు కాస్మోక్లబ్ చేస్తున్న కృషిని అభినందించారు. గతంలో రాష్ట్ర స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం పోటీలు నిర్వహించారని, ఇప్పుడు ఆల్ ఇండియా స్థాయిలో టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఎంఎంసి మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎపిఐఐడిసి ఛైర్మన్ మంతెన రామరాజు, సంస్థ ఉపాధ్యక్షులు సత్యనారాయణ రాజు కార్యదర్శి వి.వి.సోమరాజు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - తణుకు

వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించినట్లయితే రోడ్డు ప్రమాదాల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చని ట్రాఫిక్ ఎస్ఐ డి.ఆదినారాయణ అన్నారు. ఆదివారం తణుకు టౌన్ నరేంద్ర కూడలిలో మోటార్ సైకిళ్లు, ఆటోలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారితో ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారందరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని తెలిపారు. వాహనాలు నడుపుట వలన 75 శాతం వరకు ప్రమాదాలు కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం విధానాలపై సమరశీల పోరు

పట్టణ మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - తణుకు

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు సాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. స్థానిక అమరవీరుల భవనంలో సిపిఎం పట్టణ ఐదో మహాసభ రెండో రోజు ఆదివారం కొనసాగింది. ముఖ్యఅతిథి గోపాలన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మహనీయులు అందించిన స్వాతంత్ర స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంలో ఉన్న కార్మిక, రైతు హక్కులపై కార్పొరేట్లు దాసోహం కావడం సిగ్గుచేటన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలను మోడీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అంబానీ, అదానీల సంక్షేమం కోసమే మోడీ పని చేస్తున్నారని విమర్శించారు. డిసెంబరు 20, 21, 22 తేదీల్లో భీమవరంలో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఎం నాయకులు కౌజారామ్మోహన్‌రాయ్, పివి ప్రతాప్, గార రంగారావు, గుబ్బల గోపి, అడ్డగర్ల అజయకుమారి, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ద్వారా వస్తున్న కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు కొన్ని తీర్మానాలు మహాసభ ఆమోదించింది. జయంతి కాలనీలోని యానాదులకు గతంలో ఇచ్చిన ఇళ్ల స్థానంలో నూతన ఇళ్లను ప్రభుత్వం ఉచితంగా నిర్మించి ఇవ్వాలని, గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లు వెంటనే పూర్తి చేసి అందించాలని, ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, రోడ్లు, డ్రెయినేజీ, వీధి లైట్లు, కుక్కలు, దోమలు వంటి సమస్యలు పరిష్కరించాలని, అర్హులందరికీ రేషన్‌కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానించింది.

అడ్డగర్ల అజయకుమారి

పట్టణ కార్యదర్శిగా అజయకుమారి ఎన్నిక

సిపిఎం నూతన పట్టణ కార్యదర్శిగా అడ్డగర్ల అజయకుమారి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా పివి.ప్రతాప్, పిఎల్.నర్సింహారావు, గుబ్బల గోపి, కె.నాగరత్నం, వల్లూరి వెంకటేశ్వరరావు, ఎన్ఎ.బాబు ఎన్నికయ్యారు.

పలు చోట్ల కార్తీక వన సమారాధనలు

ప్రజాశక్తి - కాళ్ల

కార్తీక వన సమారాధనతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోందని ఏలూరుపాడు సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు అన్నారు. ఏలూరుపాడులో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధనను ఆదివారం నిర్వహించారు. సామాజిక సేవలో క్షత్రియులు ముందుండాలని, క్షత్రియులు విద్య, రాజకీయ, ఆర్థిక, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందాలని తెలిపారు. వన మహోత్సవానికి విచ్చేసిన మహిళలు, పెద్దలు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. కార్తీక మాసంలో వన భోజనాలు ఎంతో ప్రత్యేకమైనవని దాట్ల వాసురాజు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు, కలిదిండి కష్యప్ రాజు, దాట్ల శ్రీనివాసరాజు, దాట్ల రామకృష్ణంరాజు, మంతెన రవివర్మ పాల్గొన్నారు.

భీమవరం టౌన్: కార్తీక మాసంలో వన భోజనాలు చేస్తే అశ్వమేధ యాగం చేసిన ఫలం లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. భీమవరం ప్రకృతి ఆశ్రమంలో శ్రీఉమా సోమేశ్వర గుణుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పంచదశ వార్షిక బ్రాహ్మణ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా పట్టణంలోని విష్ణు కళాశాలలో బిడిఎస్ రెండో సంవత్సరం చదువుతున్న అబ్బరాజు పవన్ కళ్యాణ్ అనే విద్యార్థికి శ్రీఉమా సోమేశ్వర గుణుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య తరుపున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు వేలూరి హనుమ కిరణ్ శర్మ, కార్యదర్శి మారెళ్ల అఖిలేష్ శర్మ, ఉపాధ్యక్షులు వేలూరి శేషగిరిరావు శర్మ, బొల్లాప్రగడ శేష శర్మ, చెరుకుపల్లి రాజ్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

పెనుమంట్ర : కార్తీక వనసమారాధన పేరుతో జరిగే వన భోజనాల వల్ల స్నేహ సంబంధాలు పెరుగుతాయని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు అన్నారు. ఆదివారం పెనుమంట్రలో క్షత్రియ వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పెద్దలు దాట్ల విశ్వనాథరాజు, దాట్ల రంగావతి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు: మొగల్తూరులోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో మ్యూజికల్ ఛైర్స్, హౌసీ, అంచాక్షరి, క్విజ్ పోటీలు నిర్వహించారు. యువజన సంఘం ఆధ్వర్యంలో హౌసీ లక్కీ డిప్ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. ముందుగా గ్రామానికి చెందిన కారుమూరు రామకృష్ణ శిరీష దంపతులు ఉసిరి చెట్టు వద్ద సత్యనారాయణ వ్రతం చేశారు. కార్యక్రమంలో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా యువజన సంఘ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

మొగల్తూరు : మొగల్తూరులోని కోట వద్ద కాసానివారితోట వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు ఎం.సత్యనారాయణ, అధ్యక్షుడు బుడ్డిగ బాలరాజు, సంఘం ప్రధాన కార్యదర్శి కాసాని రామకృష్ణ బహుమతులు అందజేశారు.

పెనుగొండ : శెట్టిబలిజి గౌడ సంఘం ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత యువతపైనే ఉందని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో పెనుగొండ శెట్టిబలిజ గౌడ 11 సంఘాల కార్తీక వన సమారాధనలో పాల్గొని ఆయన మాట్లాడారు. శెట్టిబలిజ, గౌడ, ఈడుగ, బలజ జాతి యావత్తు సంఘ బలో పేతానికి ఐక్యత ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ రావు మాట్లాడారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం : ఎల్‌బిచర్ల గ్రామంలో మండల గౌడ, శెట్టి బలిజ సంఘం 18వ వార్షికోత్సవ కార్తీక వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు విచ్చేశారు. ఆయనను సత్కరించారు.

పంట బోదెలో పడి రజక వృత్తిదారుడు మృతి

ప్రజాశక్తి - ఆచంట

మద్యం మత్తులో అదుపుతప్పి పంట బోదెలో పడి రజక వృత్తిదారుడు మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం కొడమంచిలి గ్రామంలో వెలుగుచూచింది. గ్రామస్తుల వివరాల ప్రకారం. కొడమంచిలి సంత మార్కెట్లో నివాసం ఉంటున్న రజక వృత్తిదారుడు బండారు నాగేశ్వరరావు (48) శనివారం రాత్రి కొడమంచిలిలో ఆర్అండ్‌బి రహదారి పక్కనున్న మద్యం షాపులో మద్యం తాగాడు. అనంతరం అదుపుతప్పి సమీపంలో ఉన్న పంట బోదెలో పడి మృతి చెంది విగతజీవిగా కనిపించాడు. ఆదివారం ఉదయం కొడమంచిలి గ్రామస్తులు మృతదేహాన్ని చూసి బంధువులకు సమాచారం అందించారు. బంధువులు మృతదేహాన్ని బయటకు తీసి కన్నీరుమున్నీరయ్యారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. నాగేశ్వరరావు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది.

పంట బోదె నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న కుటుంబ సభ్యులు

జనవాసాల మధ్యలో మద్యం దుకాణం

మండలంలోని కొడమంచిలి ఆర్అండ్‌బి రహదారి పక్కన జనవాసాలకు మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాల, కూలి నాలి చేసుకునే జీవించే ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడం దారుణమని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల జీవితాలను బుగ్గిపాలు చేసున్న మద్యం దుకాణాన్ని తక్షణం ఇక్కడ నుంచి తొలగించాలని మాజీ ఎంపిటిసి సభ్యులు చిలుకూరి రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఈ రహదారి గుండా విద్యార్థులు, ఉద్యోగులు మహిళలు ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఏమైనా సంఘటనలు జరిగితే ఎవరు బాధ్యులని ఆయన ప్రశ్నించారు. తక్షణం అధికారులు స్పందించి ఆర్అండ్‌బి రహదారి పక్కన ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజాప్రతినిధులకు సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల నామినేటెడ్ పదవుల్లో స్థానం దక్కించుకున్న శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎం.ఎ.షరీఫ్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌కు కూటమి ఆధ్వర్యంలో సోమవారం సత్కార సభ ఏర్పాటు చేసినట్లు టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక తెలగాకళ్యాణ మండపంలో ఈ సన్మానం జరుగుతుందని చెప్పారు.

రేపు సిపిఎం మండల మహాసభ

ప్రజాశక్తి - ఆచంట

ప్రజా ఉద్యమాల రథసారధి సిపిఎం మండల మహాసభ ఈ నెల 19న స్థానిక కొత్తూరు సెంటర్‌లోని ఆర్యవైశ్య సత్రంలో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆచంట పురవీధుల్లో సిపిఎం జెండాలను అలంకరించారు. ఈ కార్యక్రమంలో నేతలు సిర్రా నరసింహమూర్తి, తలుపూరి బుల్లబ్బాయి, బండి రంగారావు, కుసుమే జయరాజు, మచ్చ సుబ్బారావు, కొండేటి సత్యనారాయణ, ఉన్నమట్ల పండు, సుబ్బారావు, సింహాచలం, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు పట్టణ, పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిఐ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు. తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా అధ్యక్షులు వివిఎన్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో, పదం కుమార్ గుప్త ఆర్థిక సహకారంతో ఆదివారం కడకట్లలోని జనతా ఛారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్య సిబ్బంది ఈ శిబిరంలో 97 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 29 మంది పేషెంట్లకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కొంత మందికి ఆపరేషన్ నిమిత్తం నిడదవోలు హాస్పిటల్ కి రిఫర్ చేశారు. కార్యక్రమంలో చిన్నం జగదీష్, ఎల్ఎస్‌వి.నాగేశ్వరరావు, పచ్చ వెంకటేశ్వరరావు, మదన్ మోహన్ అగర్వాల్, సన్నిధి సూర్యనారాయణమూర్తి, వంగపండు రామ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా మురళీకృష్ణ పుట్టినరోజు

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్న) పుట్టినరోజును ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని లక్ష్మణేశ్వరం చిన్న స్వగృహం వద్ద అభిమానులు, జనసేన నాయకులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం బస్టాండ్ వద్ద డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఆయన సోదరుడు లక్ష్మణేశ్వరం మాజీ సర్పంచి చాగంటి పార్థసారధి ప్రారంభించి, ఆహార పదార్థాలు వడ్డించారు. కార్యక్రమంలో అభిమానులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులతో నష్టపోతున్న రైతులను ఆదుకుని ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలని సీతారాంపురం సహకార సంఘం మాజీ అధ్యక్షుడు కల్వకొలను వీరాస్వామి (తాతాజీ) అన్నారు. సీతారామపురంలో తాతాజీ స్వగృహంలో వద్ద రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ వరదలు, విపత్తులతో సార్వాసాగు ముంపునకు గురై మండలంలో సుమారు వేలాది ఎకరాలు సాగుకు పనికి రాకుండా పోయిందన్నారు. రబీసాగు చేసుకునేందుకు రైతులకు వ్యవసాయ పరికరాలు, డ్రోన్లు, యంత్రాలు, విత్తనాలు రాయితీపై అందజేయాలన్నారు. సాగుకు అవసరమైన నాణ్యమైన ఎరువుల, పురుగు మందులు సరఫరా చేయడంతో పాటు వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంబించే విధంగా సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచులు మేకల పరశు రామ్, కూనపరెడ్డి రంగారావు, మాంద్రు నాగరాజు, మాజీ వైస్ ఎంపిపి చక్రవర్తి పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - ఆచంట

పెదమల్లం పంచాయతీ పరిధి సిర్రా వారి పేటలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై నిరాశ్రయులైన లంక ధనరాజ్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట అన్నారు. ఆదివారం సాయంత్రం సిర్రా వారి పేటలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన లంక ధనరాజ్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండేటి వీరస్వామి, సిర్రా బాలాజీ, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతిభ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలోని గన్నాబత్తుల పెద్దతాత తులసమ్మ తెలగా కళ్యాణ మండపం వద్ద ఆదివారం రాయల్ క్లబ్ నరసాపురం వారిచే రెండు వందల మందికిపైగా ప్రతిభ గల విద్యార్థులకు దాతల ద్వారా సేకరించిన పది లక్షల రుపాయలు స్కాలర్‌షిప్స్‌గా అందించారు. ఈ కార్యక్రమానికి రాయల్ క్లబ్ అధ్యక్షులు జక్కం బాబ్జీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసీ రామచంద్ర ప్రభు, శీకాలం రాంబాబు, అందే కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.